# నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 16 జూన్ 2025 | KARIMNAGAR


## ప్రమాదకరంగా నందగిరి వంతెన

పెగడపల్లి మండలం నందగిరి సమీపంలోని పెగడపల్లి-కరీంనగర్ ప్రధాన రోడ్డులో ఎస్సారెస్పీ కాలువపై వంతెన ప్రమాదకరంగా తయారైంది. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించడంతో రాళ్లు, కంకర, ఇసుక తేలి శిథిలావస్థకు చేరింది. సిమెంట్ రెయిలింగ్ కూలిపోతూ వాహనదారులను వణికిస్తున్నది. పెగడపల్లి నుంచి గంగాధరతో పాటు కరీంనగర్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కాగా, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని మండల ప్రజానీకం కోరుతున్నది.

**- పెగడపల్లి, జూన్ 15**



పెగడపల్లి-కరీంనగర్ ప్రధాన రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న ఎస్సారెస్పీ వంతెన

## • పిచ్చుక గూళ్ల తోరణం



.. ఇక్కడ వరుసగా పొదిగిన పిచ్చుకల గూళ్లు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఒకదాని వెంట మరొకటి ఉన్న ఈ గూళ్లు తోరణంలా మారి ఆహ్లాదం పంచుతున్నాయి. ముస్తాబాద్ మండలం మద్దికుంటలోని పెద్ద చెరువు కట్ట కింద పెద్ద వ్యవసాయ బావిపై నుంచి ఉన్న విద్యుత్ తీగలపై పిచ్చుకలు గూళ్లు కట్టుకొని, కిచకిచలతో సందడి చేస్తున్నాయి.

**-ముస్తాబాద్, జూన్ 15**







కరీంనగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

# నర్సింగ్ కాలేజీల్లో బోధకులేరీ?

- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- రాష్ట్రంలో గతేడాదే 16 కళాశాలల ప్రారంభం
- ఐఎన్సీ మార్గదర్శకాలకు తూట్లు
- 10:1 నిష్పత్తిలో నియమించాల్సి ఉన్నా నిర్లక్ష్యం
- ఉన్నవారితోనే సర్దుబాటు
- నష్టపోతున్న విద్యార్థులు

**వైద్యరంగంలో కీలకమైన నర్సింగ్ విద్యను రాష్ట్ర సర్కారు నిర్వీర్యం చేస్తున్నది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 16 నర్సింగ్ కళాశాలతోపాటు పాత కాలేజీల్లో బోధకుల నియామకంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఎన్సీసీ) మార్గదర్శకాల ప్రకారం 10:1 నిష్పత్తిలో అంటే ప్రతి పది మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాల్సి రాగా, ఏదో కొద్దిపాటి మందితో సర్దుబాటు పద్ధతిలో నెట్టుకొస్తున్నది. అసలే అద్దె భవనాలు.. ఆపై అరకొర వసతులతో నడుస్తున్న కళాశాల్లో రోజురోజుకూ బోధన కుంటుపడిపోతుండగా, స్టూడెంట్లకు తీరని నష్టం జరుగుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఫ్యాకల్టీని రిక్రూట్‌మెంట్ చేయాల్సిన అవసరమున్నది.**

కరీంనగర్, జూన్ 15 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్: వైద్య రంగంలో నర్సింగ్ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉన్నది. నాలుగేండ్ల ఈ కోర్సులో 8 సెమిస్టర్లు పూర్తి చేయాల్సి ఉండగా, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్సీ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి నర్సింగ్ కాలేజీలో 10:1 చొప్పున ఫ్యాకల్టీస్ ఉండాలి. అంటే ప్రతి పది మంది విద్యార్థులకు ఒక టీచింగ్ అధ్యాపకుడిని నియమించినప్పుడే తరగతుల బోధన సరిగ్గా జరుగుతుంది. కానీ, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 16 నర్సింగ్ కళాశాలల్లో ఐఎన్సీ మార్గదర్శకాలు ఎక్కడా అమలు కావడం లేదు. 2024 డిసెంబర్‌లో కరీంనగర్‌తోపాటు కొడంగల్, ఆంథోల్, నిజామాబాద్, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, ఆసిఫాబాద్, కుద్బుల్లాపూర్, మహేశ్వరం, మెదక్, ములుగు, యాదాద్రి భువనగిరి, నారాయణపేట్, నిర్మల్, రామగుండంలో నర్సింగ్ కాలేజీలను ప్రారంభించగా, ఇప్పటి వరకు ఒక్క చోట కూడా పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ నియామకం జరగలేదు. ఉన్న కొద్ది మంది ఫ్యాకల్టీతోనే నెట్టుకొస్తుండగా, సరైన బోధన లేక విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. కొత్త కాలేజీల్లోనే కాదు, రాష్ట్రంలోని మిగతా నర్సింగ్ కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది.

### ఐఎన్సీకి మార్గదర్శకాలకు తిలోదకాలు

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 2018లో ఏర్పాటు చేసిన నర్సింగ్ కాలేజీలో 100 సీట్లు ఉన్నాయి. ఇప్పుడు ఈ కాలేజీలో 400 మంది అభ్యసిస్తున్నారు. ఐఎన్సీ మార్గదర్శకాల ప్రకారం ఈ కాలేజీలో ప్రొఫెసర్ క్యాడర్‌లో ఉండే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్ ఉండాలి. ఏడుగురు ప్రొఫెసర్లు, 12 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 20 మంది లెక్చరర్లు ఉండాలి. ఇక 2021లో ఏర్పాటు చేసిన గద్వాల్, సిద్దిపేట, బాన్సువాడ నర్సింగ్ కళాశాలల్లోనూ ఇదే క్యాడర్ స్ట్రెంత్‌తో ఫ్యాకల్టీస్ ఉండాల్సి ఉండగా, సరిపడా లేరు. ఈ రెండు కాలేజీల నుంచే 2024లో ఏర్పాటు చేసిన 16 కొత్త కళాశాలలకు సర్దుబాటు చేయడంతోనే కొరత ఏర్పడింది. ప్రస్తుతం సిరిసిల్ల కళాశాలలో చూస్తే 12 మంది లెక్చరర్లు మాత్రమే ఉన్నారు. మిగతా మూడు నర్సింగ్ కళాశాలల పరిస్థితి కూడా ఇలాగే ఉన్నట్లు తెలుస్తున్నది. ఐఎన్సీ మార్గదర్శకాల ప్రకారం 40 సీట్లు ఉన్న కళాశాలలో 16 మంది, 60 సీట్లు ఉన్న కాలేజీలో 24 మంది, 100 సీట్లు ఉన్న కాలేజీలో 40 మంది ఫ్యాకల్టీస్ అందుబాటులో ఉండాలి. కానీ, రాష్ట్రంలోని 37 నర్సింగ్ కళాశాలలో ఎక్కడా ఈ మార్గదర్శకాలు అమలు కావడం లేదని తెలుస్తున్నది.

### విద్యార్థులకు తీవ్ర నష్టం

నర్సింగ్ విద్యార్థులకు మంచి బోధన అందినప్పుడే వారు తమ నైపుణ్యం పెంచుకునే అవకాశముంటుంది. కానీ, ఏ కళాశాలలోనూ పూర్తి స్థాయి ఫ్యాకల్టీ లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తున్నది. ప్రొఫెసర్ క్యాడర్‌కు ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించాలి. కానీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కూడా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. సీనియర్ లెక్చరర్లను వైస్ ప్రిన్సిపాళ్లుగా నియమిస్తున్నారు. టీచింగ్ ఫ్యాకల్టీని ఇష్టారీతిలో నియమిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రతి కళాశాలకు ఎమ్మెస్సీ స్టాఫ్ నర్సులను బోధనా సిబ్బందిగా తీసుకుంటున్నారు. అనుభవం లేని వారితో పాఠాలు చెప్పిస్తున్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు టీచింగ్ స్టాఫ్‌కు పదోన్నతులు కల్పించ లేదు. 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే వీరికి కల్పించిన పదోన్నతులు చివరివి. ప్రమోషన్లు కల్పించకుండానే కీలకపోస్టులు అప్పగిస్తున్నారనే ఆరోపణలు సైతం వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల చదువులు అటకెక్కే పరిస్థితి కనిపిస్తున్నది. ఇక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కళాశాలలకు ప్రభుత్వం నెలల తరబడి అద్దె చెల్లించడం లేదని, దీంతో ఖాళీ చేయిస్తామని భవనాల యజమానులు అధికారులతో గొడవకు దిగుతున్నట్లు తెలుస్తున్నది. మొత్తానికి ఎంతో ఉన్నతమైన నర్సింగ్ విద్యను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ఇప్పటికైనా ప్రతి కళాశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి బోధన సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. లేదంటే విద్యార్థులు మరింత నష్టపోయే ప్రమాదమున్నది.

# బదిలీకి నై.. ఉన్న చోటుకే సై!



- ట్రాన్స్‌ఫర్ల నుంచి మినహాయింపు కోసం సెర్ప్ ఉద్యోగుల పైరవీలు?
- ప్రస్తుతం ఉన్న స్థానానికే మొదటి ప్రాధాన్యత
- తప్పదనుకుంటే అధికార ప్రజాప్రతినిధులతో ఒత్తిడి

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 15 : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ (డీఆర్‌ఏ)లో చేపడుతున్న బదిలీల్లో అప్పుడే పైరవీల పర్వం మొదలైంది. ఏళ్లకేళ్లుగా పాతుకుపోయిన కొంతమంది ఉద్యోగులు, జిల్లా కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ససేమిరా అంటున్నట్లు తెలుస్తున్నది. దీర్ఘకాలంగా జిల్లాలో కొనసాగుతున్న వారంతా విధిగా పక్కజిల్లాల ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉన్నా, ప్రస్తుతం కొనసాగుతున్న జిల్లానే మొదటి ప్రాధాన్యతలో ఎంచుకున్నట్లు తెలిసింది. తమను యథాస్థానంలో కొనసాగించేలా రాజకీయ ఒత్తిళ్లకు కూడా దిగుతున్నట్టు డీఆర్‌ఏ వర్గాల్లో చర్చ కొనసాగుతున్నది. వివిధ రకాల కారణాలతో కొన్నేళ్లుగా సెర్ప్‌లో బదిలీలు జరగకపోగా, వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పలు కేటగిరీలకు చెందిన ఉద్యోగులు ఆయా విభాగాల్లో గట్టి పట్టు సంపాదించినట్టు పేర్కొంటున్నాయి. వాటిలో జరిగే లోటుపాట్లు కూడా వారికి క్షుణ్ణంగా తెలియడంతో ఏకచత్రాధిపత్యం చెలాయిస్తున్నట్లు తెలుస్తున్నది. అలాగే అత్యధిక మంది ఉద్యోగులు ప్రస్తుతం పనిచేస్తున్న చోట, ఉద్యోగానికి సమాంతరంగా పలు వ్యాపారాలు కూడా మొదలుపెట్టి నాలుగు చేతులా సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రస్తుత స్థానాల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయితే ఆదాయ ఆర్జనకు భారీగా గండి పడుతున్నది. క్షేత్రస్థాయి సందర్శనలు లేకుండానే ఉన్నచోట నుంచే విధులు నిర్వర్తించే అవకాశానికి కూడా దూరమవుతారు. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లి ఆదాయ మార్గాలు దూరం చేసుకుని శారీరక శ్రమను కొని తెచ్చుకునే బదులు, ఎలాగోలా అధికారులను ఒప్పించి యథా స్థానాల్లో కొనసాగేందుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు సెర్ప్ ఉద్యోగులు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలో వివిధ కేడర్లలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు బదిలీలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు ఎల్ 5 కేటగిరీ కింద అదనపు డీఆర్డీవోల బదిలీలు పూర్తి చేయగా, ఎల్ ఫోర్ కేటగిరీ కిందికి వచ్చే డీపీఎంలకు కూడా నేడో రేపో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అలాగే ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ కేటగిరీలకు చెందిన ఉద్యోగులకు కూడా బదిలీలు చేపట్టేందుకు ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో ఎల్ 5 నుంచి ఎల్ 1 వరకు 700 పై చిలుకు ఉద్యోగులు ఉండగా, ఎల్ 5 కేటగిరీ అధికారులకు కౌన్సెలింగ్ పూర్తయి, బదిలీ ఉత్తర్వులు కూడా విడుదల చేశారు. అనంతరం ఎల్ 4 కేటగిరీ పరిధిలోకి వచ్చే డీపీఎం లకు ఒకటిరెండ్రోజుల్లో కౌన్సెలింగ్ చేయనున్నారు. స్థాన చలనానికి సుముఖంగా లేని పలువురు డీపీఎంలు అధికార పార్టీ పెద్దల వద్దకు పరుగులు తీస్తున్నట్టు తెలుస్తున్నది. కుంటిసాకులు చెబుతూ తమను ఉన్న స్థానాల్లోనే కొనసాగించేలా ఆదేశించాలని వేడుకుంటున్నట్టు, మరి కొంత మంది సిఫారసు లేఖలతో సెర్ప్ సీఈవోను ముందే కలుస్తున్నట్టు వినికిడి. గ్రామీణ ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా విధులు నిర్వర్తించాల్సిన గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగుల బదిలీల్లో పైరవీలకు తావు కల్పిస్తే, ఆ సంస్థ లక్ష్యం నీరుగారి పోయే అవకాశాలున్న దృష్ట్యా పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని గ్రామీణ అభివృద్ధి శాఖ ఉద్యోగులు కోరుతున్నారు.

# కరీంనగర్ కలెక్టర్‌కు జీజీహెచ్‌లో శస్త్రచికిత్స






కరీంనగర్ విద్యానగర్, జూన్ 15 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన(జీజీహెచ్)లో కలెక్టర్ పమేలా సత్పతికి ఆదివారం మెడికల్ సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. కొన్ని సంవత్సరాల నుంచి తీవ్ర తలనొప్పి, ముక్కు దిబ్బడ, నాసిక అడ్డంకి, సైనసైటిస్, శ్వాస ఇబ్బందితో బాధడుతున్న కలెక్టర్ వివిధ ఈఎన్‌టీ వైద్యులు రాసి ఇచ్చిన మందులను తాత్కాలికంగా వినియోగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో కరీంనగర్ ప్రభుత్వ వైద్యులపై నమ్మకంతో ప్రభుత్వ దవాఖానలో అత్యవసర 'ఎండోస్కోపీ నేసలు సర్జరీ, సెప్టో ప్లాస్టిక్టినీ'ని చేయించుకున్నారు. ఇప్పటివరకు ఉన్నతాధికారులు, వారి కుటుంబ సభ్యుల డెలివరీలు మాత్రమే ప్రభుత్వ దవాఖానలో జరిగాయని, మొట్టమొదటిసారిగా కలెక్టర్ సర్జరీ చేసుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారని సూపరింటెండెంట్ వీరారెడ్డి కొనియాడారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ దవాఖాన వైద్య సేవలు నియోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. శస్త్ర చికిత్స చేసిన వారిలో ఈఎన్‌టీ సర్జన్స్ ఎల్ రవికాంత్, సందీప్, మధుమిత, మత్తు వైద్యులు శాంతన్ కుమార్, చంద్రశేఖర్, సతీశ్, సంగీత, ఫిజీషియన్ నవీన, నర్సింగ్ ఆఫీసర్స్ మాధవి, మమత, సుజాత ఉన్నారు.

### కలెక్టర్‌కు వైద్యారోగ్య శాఖ మంత్రి అభినందన

ప్రభుత్వ దవాఖానలో శస్త్రచికిత్స చేసుకుని స్ఫూర్తిగా నిలిచిన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. కలెక్టర్ నిర్ణయం ఆమె చురుకైన న్యాయకత్వాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. సంక్లిష్టమైన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించినందుకు వైద్యులను అభినందించారు. కలెక్టర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఘనంగా శ్రీవాణీనికేతన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



శ్రీ వాణీనికేతన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 15 : వారంతా బాల్య మిత్రులు.. 1990 నుంచి 2000 వరకు గోదావరిఖనిలోని శ్రీ వాణీ నికేతన్ హైస్కూల్‌లో కలిసి చదువుకున్నారు. వీరు పదో తరగతి పూర్తి చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం కరీంనగర్ వేదికగా సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొన్నారు. నగరంలోని హోటల్ తారకలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి, ఆటాపాటలతో సరదాగా గడిపారు. అలనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. పదో తరగతి పూర్తయిన 25 ఏళ్లలో నాలుగోసారి జరిగిన సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్, బీ రాజు, కుమార్, అనిత, పద్మ, కళావతి, అనిల్‌కుమార్, బీ రవి, రంజిత్ పాల్గొన్నారు.

## ఆధార్ అప్‌డేట్ గడువు మరోసారి పెంపు

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 15 : ఆధార్ ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు మరోసారి గడువు పెంచారు. ఈ మేరకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నది. ఆధార్ కార్డు పొందిన నాటి నుంచి ఇప్పటి వరకు అప్‌డేట్ చేసుకోని వారి కోసం రెండేళ్లుగా ఉడాయ్ ఉచితంగా చేసుకునే అవకాశం కల్పిస్తున్నది. ఇదే క్రమంలో ఈ నెల 14 వరకు ఉచితంగా అప్లోడ్ చేసుకునేందుకు ఉన్న గడువు శనివారంతో ముగిసింది. అయినా, ఇంకా అప్డేట్ చేసుకోని వారి సంఖ్య గణనీయంగా మిగిలిపోగా, మరో ఏడాది పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్టు ఎక్స్‌లో వెల్లడించింది. 2026 జూన్ 14 వరకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉచితంగా అప్‌డేట్ చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు.





# కోరుట్లలో ఘోర ప్రమాదం



విద్యుత్ షాక్ తగిలి చెలరేగిన మంటల్లో చిక్కుకున్న కార్మికులు

**గణేశ్ విగ్రహాల తయారీ కేంద్రంలో విద్యుత్ షాక్**

- ఇద్దరు మృత్యువాత.. మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- విగ్రహాన్ని షెడ్డులోకి తరలిస్తుండగా కరెంట్ తీగలు తగిలి ఘటన
- జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలింపు

కోరుట్ల, జూన్ 15: విగ్రహాల తయారీ కేంద్రంలో విద్యుత్ ప్రమాదం జరిగింది. భారీ వినాయక విగ్రహాన్ని ఒక చోట నుంచి మరో చోటుకు తరలిస్తుండగా, షాక్ తగిలి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కోరుట్లలో విషాదం నింపింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని మెట్‌పల్లి రోడ్డులో ఉన్న శ్రీబాలాజీ వినాయక విగ్రహాల తయారీ కేంద్రాన్ని ప్రకాశం రోడ్డు కాలనీకి చెందిన అల్వాల వినోద్ పదేళ్లుగా నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వర్షం వస్తుందనే అనుమానంతో షెడ్డు ఆవరణలో ఉన్న 12 ఫీట్ల వినాయక గణేశ్ విగ్రహాన్ని మరో షెడ్‌లోకి తరలించేందుకు కార్మికుల సహాయం తీసుకున్నాడు. విగ్రహాన్ని తీసుకెళ్తుండగా పైన ఉన్న 33/11 కేవీ విద్యుత్ తీగలకు విగ్రహం తగిలింది. అయితే, ఆ విగ్రహం తడిగా ఉండడంతో కరెంట్ షాక్ వచ్చి మంటలు చెలరేగాయి. దీంతో తొమ్మిది మంది కార్మికులతోపాటు నిర్వాహకుడు వినోద్ కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. కాగా, ఘటనా స్థలంలో తీవ్రంగా గాయపడ్డ వినోద్, బంటి అలియాస్ సాయికుమార్ అపస్మారక స్థితికి చేరుకోగా దవాఖానకు తరలిస్తుండగా మృత్యువాత పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ అల్వాల నితిన్, వెంకట్‌రెడ్డి, కృష్ణ, సాయినాథ్, హనుమంతు, ఆకాశ్, రోషన్, ఆర్షద్‌కు కోరుట్ల ప్రభుత్వ దవాఖానలో ప్రాథమిక చికిత్సను అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, వినోద్‌కు భార్య వర్షిణి, ఇద్దరు కూతుళ్లు ప్రణయ, శ్రీయాన్షి ఉండగా, స్థానిక ఏస్కొని గుట్ట కాలనీకి చెందిన సాయికుమార్ అవివాహితుడు. వినోద్ వద్ద పదేళ్లుగా పని చేస్తున్నాడు.



అల్వాల వినోద్, ఎల్లుట్ల సాయికుమార్ (ఫైల్)



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

### వెంటనే స్పందించిన స్థానికులు

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వెంటనే స్పందించారు. విద్యుత్ షాక్‌తో కుప్పకూలిన కార్మికులను రక్షించేందుకు శతవిధాలా ప్రయత్నించారు. విద్యుత్ తీగలను కర్ర సాయంతో పక్కకు జరిపి అంబులెన్స్‌లో కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సీఐ సురేశ్ బాబు, ఎస్ఐలు శ్రీకాంత్, రాంచంద్రం, సంఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే ఆరా

గాయపడ్డ కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆరా తీశారు. కోరుట్ల దవాఖాన సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసిన ఎమ్మెల్యే, వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు కార్మికులను తరలించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేశారు. కార్మికులకు అవసరమైన అత్యవసర సేవలు అందించాలని కోరారు. కార్మికులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. జగిత్యాల దవాఖానలో బాధితులను కలెక్టర్ సత్యప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జీవన్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావు పరామర్శించారు.